రాష్ట్రపతి గ్యాలంటరీ అవార్డుకు

యాదయ్య ఎంపికవ్వడం అభినందనీయం

ఎమ్మెల్యే కాలె యాదయ్య

రాష్ట్రపతి గ్యాలంటరీ అవార్డుకు ఎంపికైన హెడ్ కానిస్టేబుల్ చదువు యాదయ్య దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల రూరల్, ఆగస్టు 25 : చేవెళ్ల మండల పరిధి మీర్జాగూడ గ్రామానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ చదువు యాదయ్య రాష్ట్రపతి గ్యాలంటరీ అవార్డుకు ఎంపికవ్వడం అభినందనీయమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆదివారం మీర్జాగూడ గ్రామంలో యాదయ్యకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయగా.. ఎమ్మెల్యే కాలె యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై యాదయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యాదయ్య తన ప్రాణాలను లెక్క చేయకుండా విధి నిర్వహణలో దొంగలను పట్టుకున్న విషయాన్ని, ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. పోలీసు శాఖలో ఇలాంటి వ్యక్తులు అరుదుగా ఉంటారని, తన ధైర్య సాహసాలు అనుసరణీయమన్నారు. మీర్జాగూడ గ్రామం నుంచి ఏకంగా రాష్ట్రపతి శౌర్య పతకానికి ఎన్నికైనందుకు చాలా గర్వపడుతున్నానన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార జాయింట్ కన్వీనర్ వసంతం, మాజీ సర్పంచ్ భీమయ్య, చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజ, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మేకవనంపల్లిలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

వికారాబాద్, ఆగస్టు 25 : మోమిన్‌పేట మండల పరిధిలోని మేకవనం పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆదివారం ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆవిష్కరించారు. అంతకు ముందు గ్రామంలోని పెట్రోల్ బంక్ నుంచి శివాజీ యూత్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి, బైక్ ర్యాలీతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. శివాజీ విగ్రహావిష్కరణ అనంతరం పూల మాలలు వేసి జైజైలు కొట్టారు. విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని బహూకరించిన పట్ల రామచంద్రారెడ్డిని, విగ్రహం ఏర్పాటుకు సహకరించిన ప్రముఖ న్యాయవాది వెంకటరెడ్డిని ఎంపీ అభినందించారు.

రోడ్డు పరిశీలన

మొయినాబాద్, ఆగస్టు 25 : పంచాయతీరాజ్ రోడ్డును ఆర్‌అండ్‌బీ రోడ్డు పరిధిలోకి మార్చి అభివృద్ధి చేయాలని స్థానికులు రోడ్లు, భవనాల శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కోరడంతో వెంటనే ఆయన స్పందించారు. రోడ్డును పరిశీలించి రోడ్డుకు సంబంధించిన పూర్తి నివేదికను అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆదివారం అధికారులు రోడ్డును పరిశీలించారు. స్థానిక నాయకులతోపాటు ఆర్‌అండ్‌బీ ఎస్ఈ వెంకటేశ్వర్‌రావు, జేఈ చంద్రశేఖర్ మండల పరిధిలోని వెంకటాపూర్ చౌరస్తా నుంచి వయా శ్రీరాంనగర్, సురంగల్, మొయినాబాద్, పెద్దమంగళారం మీదుగా చందానగర్ గేట్ వరకు ఉన్న పంచాయతీ రాజ్ రోడ్డును సర్వే చేసి పరిశీలించారు. పంచాయతీ రాజ్ రోడ్డు పరిధిలో ఉన్న రోడ్డు 16 కిలోమీటర్లు ఉంటుందని, దానిని ఆర్‌అండ్‌బీ పరిధిలోకి మార్చడానికి సుమారు రూ.50 కోట్లు అవుతుందని అధికారులు అంచనా వేశారు. రోడ్డు సర్వే చేసి అంచనా వేసిన తరువాత మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అంచనా విలువ నివేదించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు దర్శన్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, శ్రీరాంనగర్ మాజీ సర్పంచ్ మాణెయ్య, మాజీ ఎంపీటీసీలు మాధవరెడ్డి, రాంరెడ్డి, బాకారం మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మొయినాబాద్ మండలంలోని వెంకటాపూర్ నుంచి చందానగర్ వరకు ఉన్న రోడ్డును పరివీలిస్తున్న అధికారులు, నాయకులు

అబ్దుల్ కలాం నేషనల్ అవార్డుకు ఎంపికైన ఉస్మాన్‌అలీ

పరిగి, ఆగస్టు 25 : పరిగి మండలం మిట్టకోడూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.డి.ఉస్మాన్‌అలీ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ అవార్డు 2024కు ఎంపికైనట్లు బహుజన సాహిత్య అకాడమీ సభ్యుడు మంచన్‌పల్లి శ్రీనివాస్ తెలిపారు. చిన్నారి బడి పుస్తకాన్ని రచించడంతోపాటు జైపూర్ లెర్నింగ్ పుస్తక రచనల్లో విషయ నిపుణుడుగా అనేక కథలను రాశారు. సెప్టెంబర్ 5న తిరుపతిలో నిర్వహించే బహుజన రైటర్స్ ఎనిమిదవ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో ఉస్మాన్‌అలీకి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ అవార్డును అందజేయనున్నారు.

కళ్లల్లో కారం పొడి చల్లి.. రూ.1.20లక్షలు అపహరణ

మొయినాబాద్, ఆగస్టు 25 : కూల్‌డ్రింక్స్ సరఫరా చేసే ఇద్దరు యువకులు వెళ్తున్న వాహనాన్ని గుర్తు తెలియని దుండగులు అడ్డగించి ఆపి వారి కళ్లల్లో కారం పొడి చల్లి వారి వద్ద ఉన్న నగదును లాక్కొని పరారయ్యారు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సురంగల్ నుంచి కనకమామిడి గ్రామం వెళ్లే రోడ్డులో ఆదివారం సాయంత్రం జరిగింది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం.. కూల్ డ్రింక్స్ సరఫరా చేసే ఇద్దరు యువకులు మహమ్మద్ ఈసా, భరత్‌కుమార్ ఆదివారం శంషాబాద్ లోని కూల్ డ్రింక్స్ గోదాం నుంచి వాహనంలో కూల్ డ్రింక్స్ తీసుకుని మొయినాబాద్ మండలంలోని సురంగల్ గ్రామానికి వచ్చి దుకాణాల్లో కూల్ డ్రింక్స్ సరఫరా చేశారు. అనంతరం కనకమామిడికి వెళ్తున్నారు. సుమారు సాయంత్రం 5 గంటల ప్రాంతంలో కల్వర్టు వద్దకు వాహనం రాగానే నలుగురు దుండగులు వాహనాన్ని అడ్డగించి వాహనంలో ఉన్న మహమ్మద్ ఈసా, భరత్‌కుమార్‌ల కళ్లల్లో కారం పొడి చల్లారు. అనంతరం రాళ్లతో తలపై కొట్టి వారిని గాయపరిచారు. వారి వద్ద ఉన్న రూ.1.20 లక్షలు లాక్కొని పరారయ్యారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఫార్మా కంపెనీకి పంట భూములివ్వం

- సీఎం రేవంత్‌రెడ్డి మా రైతుల జోలికి రావొద్దు
- మా భూములు ఇవ్వం..
- ఫార్మా కంపెనీ వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధులు

సమావేశంలో మాట్లాడుతున్న ఫార్మా కంపెనీ వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధులు

రవీంద్రభారతి, ఆగస్టు 25: వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండల పరిధిలోని పంట భూముల్లో ఫార్మా కంపెనీని ఏర్పాటు చేయెద్దని ఫార్మా కంపెనీ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. తమకు జీవనాధారమైన పచ్చిన పంట భూములను ఫార్మా కంపెనీకి ఇవ్వబోమని సమితి ప్రతినిధులు, రైతులు బోగమోని సురేశ్ రాజు, మాగం యాదయ్య, చాకాలి శ్రీకాంత్, సామలి శ్రీశైలం స్పష్టం చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. దుద్యాల మండలంలోని లగచర్ల, హకీంపేట్, పోతేపల్లి, ఆర్బీ తండా, పులిచెర్లకుంటతండా, ఈర్లపల్లితండా గ్రామాలకు చెందిన 1100 మంది చిన్న, సన్నకారు రైతులకు చెందిన 1375 ఎకరాల పంట భూములు రాష్ట్ర ప్రభుత్వం ఫార్మా కంపెనీ కోసం సేకరించేందుకు సిద్ధమైందని తెలిపారు. అభివృద్ధి పేరిట తమ భూములను లాక్కోవాలని చూస్తే ఊరుకోబోమని సీఎం రేవంత్‌రెడ్డిని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి మొండికేసి ఫార్మా కంపెనీలు తీసుకువస్తే తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ప్రభుత్వ వైఖరిలో మార్పు రాకుంటే ఢిల్లీలోని కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ ఇంటి ఎదుట ధర్నాలు, నిరసనలు చేస్తామని, హైకోర్టును కూడా ఆశ్రయించేందుకు సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న ఎంజీఐటీ విద్యార్థులు

నీటిని వృథా చేయవద్దు..

మణికొండ, ఆగస్టు 25 : నీటిని వృథా చేయవద్దని మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. గండిపేట వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన సేవ్ లేక్స్ కార్యక్రమంలో ఎంజీఐటీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. బ్యానర్లు, ప్లకార్డులతో ర్యాలీ చేపట్టి అవగాహన కల్పించారు.

రెసిడెన్షియల్ మార్కెట్‌లో హైదరాబాద్ టాప్-2

- అగ్ర స్థానంలో ఆర్థిక రాజధాని ముంబై
- నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ) : భాగ్యనగరం మరో ఘనత సాధించింది. రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించి దేశంలోనే అత్యంత ఖరీదైన నగరాల్లో హైదరాబాద్ టాప్-2లో నిలిచింది. దేశ ఆర్థిక రాజధాని ముంబై మొదటి స్థానం ఆక్రమించింది. ఈ విషయం 'అఫర్డబిలిటీ ఇండెక్స్' పేరుతో 'నైట్ ఫ్రాంక్ ఇండియా' తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడైంది. ఇందులో అత్యంత ఖరీదైన రెసిడెన్షియల్ మార్కెట్లలో హైదరాబాద్ రెండో స్థానం దక్కించుకున్నది. హౌస్ ఈఎంఐ-ఆదాయ నిష్పత్తి ఆధారంగా దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాలను ఎంచుకోగా.., 2024 మొదటి అర్ధభాగంలో 30 శాతంతో హైదరాబాద్ 2వ స్థానంలో నిలిచింది. 2023 నుంచి అదే స్థాయిని కొనసాగిస్తున్నది. 51 శాతం నిష్పత్తితో ముంబై మొదటి స్థానంలో నిలిచింది.

అహ్మదాబాద్‌లో తక్కువ ..

తొలి 8 నగరాల్లో అహ్మదాబాద్ అత్యంత సరసమైన రెసిడెన్షియల్ మార్కెట్‌గా ఉన్నది. 21 శాతం నిష్పత్తితో పుణె, కోల్‌కత్తా 24 శాతం చొప్పున ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ముంబై స్థోమత పరిమితి 51 శాతం ఉన్నా ఎక్కువగా ఉన్నది. ఎన్నో ఏండ్లుగా హైదరాబాద్ నగరం స్థోమత సూచిక గణనీయమైన మార్పులకు గురవుతున్నది. 2010లో 47 శాతం ఉండగా, 2019 నాటికి 34 శాతానికి పడిపోయింది. 2020లో 31 శాతానికి తగ్గింది. 2021లో దాని కనిష్ఠస్థాయి 28 శాతానికి చేరుకున్నది. తర్వాతి సంవత్సరాల్లో స్వల్ప పెరుగుదల కనిపించింది. 2022, 2023, 2024 ప్రథమార్థంలో నిష్పత్తి 30 శాతం వద్ద నిలిచింది. 2010లో హైదరాబాద్‌లో చదరపు అడుగు వెయిటెడ్ సగటు ధర రూ.2,728గా ఉన్నదని, 2019లో రూ.4,500కి పెరిగిందని నివేదిక పేర్కొన్నది. 2024 మొదటి అర్ధభాగం నాటికి ధరలు క్రమంగా రూ.5,681కి పెరిగాయి. 2019 నుంచి 26 శాతం పెరుగుదల, 2023 మొదటి అర్ధభాగంతో పోలిస్తే 5 శాతం పెరుగుదల కనిపించింది.

రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌ను విజయవంతం చేయాలి

వనస్థలిపురం, ఆగస్టు 25 : రంగారెడ్డి జిల్లా రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌ను జయప్రదం చేయాలని జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎమ్వీ రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి గునమోని సత్తయ్య, కోశాధికారి వట్టి శ్రీను తెలిపారు. సెప్టెంబర్ 20, 21, 22 తేదీల్లో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు జట్లు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పోటీల్లో విజేతలను రాబోయే రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్‌నకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. క్రీడాకారులు, జట్లు సరైన వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 15వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. స్పీడ్ విభాగానికి జి.సత్య, హాకీ విభాగానికి వి.శ్రీను, ఆర్టిస్టిక్ విభాగానికి రమ్య మురళి ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తారన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నం.95429 19225, 96669 79220లలో సంప్రదించాలని సూచించారు.

హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట శ్రీకృష్ణ గోశాలలో హరేకృష్ణ మూవ్‌మెంట్ వారి ఆధ్వర్యంలో జరిగిన కృష్ణాష్టమి వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ సీఎంకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, రాష్ట్ర పీసీసీ కార్యదర్శి జైపాల్‌రెడ్డి, రాష్ట్ర ముదిరాజ్ సంఘం కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, స్థానిక నాయకుడు అశోక్ యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

- మణికొండ

అలరించిన నృత్య ప్రదర్శనలు

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించిన పలు ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో అలరించాయి. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన కళాకారుల కూచిపూడి, భరతనాట్య నృత్య రీతులు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో మంచిర్యాల శ్రీశార్వాణి కూచిపూడి నృత్యాలయం నాట్య గురువు డాక్టర్ భార్గవి ప్రేమ్ శిష్య బృందం వినాయక కౌతం, స్వాగతం కృష్ణ, జతిస్వరం, కృష్ణ శబ్దం, దశావతార శబ్దం, స్వరజతి, కృష్ణ జనన శబ్దం, మంగళం అంశాలను కూచిపూడి నృత్యరూపకంలో ప్రదర్శించగా, రాశి సచ్చిదానందా శిష్య బృందం మల్లరి, గణేశా వందన, గురులేఖ కృతి, శ్యామలే మీనాక్షి, అర్ధనారీశ్వర స్తోత్రం, థిల్లానా అంశాలను భరతనాట్య నృత్యరూపకంలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

- కొండాపూర్, ఆగస్టు 25

ఘనంగా తీజ్ వేడుక

మియాపూర్ డివిజన్ నగిగడ్డ తండాలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో తీజ్ వేడుక ఆదివారం భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. గిరిజనులు అధిక సంఖ్యలో ఈ వేడుకలకు హాజరయ్యారు. సంప్రదాయ వస్త్ర ధారణతో నవ ధాన్యాలు వేసిన పంచ పాలికలతో గిరిజన మహిళలు ప్రదర్శన నిర్వహించి భగవంతుడికి సమర్పించారు. చిన్నారులు ఎంతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. గిరిజన సంఘం జాతీయ నాయకుడు మోహన్ నాయక్ సహా స్థానిక గిరిజన సంఘం నేతలు, మహిళలు పాల్గొన్నారు.

- మియాపూర్, ఆగస్టు 25

పంటల వైవిధ్యంతో..వ్యవసాయం లాభసాటి

గండిగూడలోని వ్యవసాయ క్షేత్రంలో జరేనియం పంట సాగును రైతులకు వివరిస్తున్న రైతు గాదె రాజశేఖర్, బంకట్‌లాల్ భాటి

శంషాబాద్ రూరల్, ఆగస్టు 25 : వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం కోసం రైతులకు వివిధ బహుళజాతి పంటలపై అవగాహన కల్పించినట్లు బహుళజాతి పంటల సాగు రైతు గాదె రాజశేఖర్ తెలిపారు. ఆదివారం గండిగూడలోని బంకట్‌లాల్ భాటియా వ్యవసాయ క్షేత్రంలో సర్వోదయ మండలి ఆధ్వర్యంలో వివిధ రకాల పంటలను రైతులకు చూపించడంతో పాటు ఆయా పంటల సాగుపై రాజశేఖర్, బంకట్‌లాల్ భాటియా వివరించారు.

వారు మాట్లాడుతూ.. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం కోసం ఒకే సమయంలో నాలుగు రకాల పంటలను సాగు చేయవచ్చునని తెలిపారు. మహాగని, మునగ, బెండ, పసుపు పంటలను ఒకే స్థలంలో వేయవచ్చన్నారు. మూడు, ఆరు నెలలు, ఐదు, పదేండ్ల పాటు ఆదాయం ఇచ్చే పంటలు సాగు చేసుకుంటే అధిక లాభాలు వస్తాయని వివరించారు. తన వ్యవసాయ క్షేత్రంలో సుగంధ ద్రవ్య పంట అయిన జరేనియం సాగు చేసే విధానం, దాని నుంచి ఆదాయాన్ని పొందే విధానాన్ని వివరించారు. సుగంధ ద్రవ్య పంటకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందన్నారు. లాభసాటి పంటలు సాగు చేయాలని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో సర్వోదయ మండలి కార్యదర్శి శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

శిల్పకళా వేదికలో హ్యాండ్ టూ హ్యాండ్ చేనేత వస్త్రప్రదర్శన

కొండాపూర్, ఆగస్టు 25 : చేనేత కళాకారులను మరింత ప్రోత్సహించాలని మిస్ యూనివర్స్ ఆంధ్రప్రదేశ్ చందనా జయరాం అన్నారు. సోమవారం మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో ఏర్పాటు చేసిన హ్యాండ్ టూ హ్యాండ్ చేనేత వస్త్ర ప్రదర్శనను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారతీయ పట్టు, హ్యాండ్‌లూమ్ వస్త్రాలకు ఎంతో ప్రత్యేకత ఉందని, చేనేత కళాకారులను మరింతగా ప్రోత్సహించాలన్నారు. అనంతరం ప్రదర్శనలో ఉంచిన వస్త్రాలను తిలకిస్తూ వాటి ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. ప్రదర్శన ఈ నెల 30 వరకు కొనసాగుతుందని, ఇందులో 14 రాష్ట్రాల నుంచి విచ్చేసిన కళాకారులు హస్తకళా ఉత్పత్తులను అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు జయేష్ గుప్తా అన్నారు.

ప్రదర్శనను ప్రారంభిస్తున్న మిస్ యూనివర్స్ ఏపీ చందనా జయరాం

కోల్‌కతా ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని యూత్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి బుద్వేల్ రైల్వేస్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

- మైలార్‌దేవ్‌పల్లి

తీజ్ వేడుకల్లో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

హిందూ ధర్మం కోసం పోరాడిన మహనీయుడు సేవాలాల్

మియాపూర్, ఆగస్టు 25 : దేశం కోసం, హిందూ ధర్మం కోసం సేవాలాల్ మహరాజ్ ఎంతో కృషి చేశారని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. గిరిజనులు ఎంతో భక్తి ప్రపత్తులతో తీజ్ పండుగను నిర్వహించుకోవాలన్నారు. మియాపూర్ నడిగడ్డ తండాలో ఆదివారం తీజ్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల అభ్యున్నతి కోసం సేవాలాల్ ఎంతగానో కృషి చేశారని, తద్వారా గిరిజనుల ఆరాధ్య దైవంగా కొలుస్తారన్నారు. గిరిజనులు విద్యావంతులై అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించిన సేవాలాల్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మోహన్, గంగాధర్, తండావాసులు స్వామీనాయక్, లక్పతి, తిరుపతి, శంకర్, రత్నాకర్, అబ్రహం, సుధాకర్, జిత్తు, మధు, సీతారాం, హన్మంతు, గోపి, తుకారాం, దశరథ్‌నాయక్, హరి తదితరులు పాల్గొన్నారు.

వయ్యారి భామను తరిమేద్దాం

- పూత దశలోపే తొలగించేద్దాం
- వర్సిటీ ప్రధాన శాస్త్రవేత్త డా.పద్మజ

వ్యవసాయ యూనివర్సిటీ, ఆగస్టు 25: అందంగా మన చుట్టూ కనిపించే ఈ కలుపు మొక్క వయ్యారి భామ (పార్థీనియం) చాలా ప్రమాదకరమైనది. విదేశం నుంచి దిగుమతై, దేశ సంపదను నాశనం చేస్తున్నది. గ్రామీణ ప్రాంతాలలో వర్షాకాలంలో ప్రజలు ఎక్కువగా ఈ మొక్క నుంచే రోగాల బారిన పడుతున్నారని తేలింది. దీని ప్రభావం పాడి పంటలతో పాటు, మనుషులపై దేశవ్యాప్తంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉన్నది. అమెరికా సంయుక్త రాష్ట్రాలకు చెందిన ఈ మొక్క మన దేశానికి 1950లో గోధుమల ద్వారా దిగుమతి అయ్యింది. ఇది అన్ని రకాల నేలల్లో ప్రధానంగా దక్షిణ భారత దేశమంతటా అనతి కాలంలోనే పాకింది. ఇది వ్యవసాయ పొలాలు, పొలం గట్టుతో పాటు ఖాళీ ప్రదేశాలలో విస్తారంగా పాకింది.

వయ్యారి భామ మొక్కపై విద్యార్థులకు అవగాహన

ప్రస్తుతం, ఈ మొక్క దేశవ్యాప్తంగా పూత దశలో ఉన్నది. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ మొదటి వారంలోపు తొలగించాలని, రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం కలుపు విభాగం ప్రధాన శాస్త్రవేత్తలు సూచించారు. ఇటీవల పార్థీనియం నివారణపై అవగాహన, వారోత్సవాల అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో ఎక్కువగా పార్థీనియం కలుపు మొక్కలు పెరిగాయని గుర్తు చేశారు. చూడ ముచ్చటగా, ముక్కుపుడకను పోలి ఉండే ఈ మొక్క పంటలకే కాకుండా, మనుషులు, పశువులకు హాని కలిగిస్తాయని తెలిపారు. ఇది పూత దశకు రాక ముందే నివారించాలని సూచించారు. జీవ నియంత్రణ, రసాయనిక పద్ధతులతో వీలైనంత త్వరగా తొలగించాలని తెలిపారు.

సత్వరమే తొలగించాలి...

ఈ మొక్క చాలా ప్రమాదకారి, ప్రజలకు ఈ మొక్క చేసే అపార నష్టంపై అవగాహన కల్పించి నివారణ చర్యలు చేపట్టాలి. వ్యవసాయ పొలాలే కాదు, నగరంలోని మన ఇంటి సమీపంలో కూడా ఎక్కువ ఖాళీ ఉన్న ప్రదేశంలో వర్షాకాలంలో పెరుగుతుంది. మొక్కను చిరు దశలోనే తొలగించాలి. గతంలో రైతులకు అవగాహన లేక పొలాల మధ్య అలాగే వదిలివేయడం వల్ల అపార నష్టం జరిగింది.

- డా. బి.పద్మజ, ప్రిన్సిపల్ సైంటిస్టు, కలుపు విభాగం హెడ్, రాజేంద్రనగర్

అపారనష్టం..

ఆయా పంటలలో 40 శాతం దిగుబడి తగ్గిస్తున్నది. టమాట, వంగ, మొక్క జొన్న పుప్పొడిపై ఎక్కువగా ప్రభావం ఉంటుంది. ఇది నల్ల రేగడి పొలాల్లో మరీ ఏపుగా పెరుగుతుంది. ఈ మొక్క వేర్ల నుంచి విషపూరిత రసాయనాలు వెదజల్లుతాయి. అక్షతల చెట్టు, కుక్కసీరికె (అఫైరాన్‌ఫస్ అస్ఫర) అనే విలువైన మొక్క దంత, నోటి దుర్వాసన, సర్వరోగ నివారిణిని ఈ మొక్క పోలి ఉంటుంది. వయ్యారి భామ వల్ల మనుషులకు వాటి ఆకులను తగిలినా చర్మ సంబంధిత, తామర, వ్యాధులు, ఆ మొక్క వాసన పీల్చినా జలుబు, కండ్ల ఎర్రబడటం, కండ్ల రెప్పలు వాపు, మొక్కలు కాల్చిన వచ్చే వాసన వల్ల ఉబ్బసం వస్తుంది. చిన్న పిల్లలు, వృద్ధులపై త్వరగా ప్రభావం చూపుతుంది.